దానికదే - దీనికిదే

మనిషన్నప్పుడు జబ్బులు, ఫ్యాక్టరీ అన్నప్పుడు ప్రమాదాలు షరా మామూలే సాధ్యమైనన్ని జాగ్రత్తలు తీసుకున్నా గూడా సాధారణమైన జలుబో రొంపనో మనిషికి రాక తప్పవు అలాగే చిన్న చిన్న ప్రమాదాలు ఫ్యాక్టరీలో జరక్కమానవు.

బాంబేలో ఎం.బి.ఏ. చదివొచ్చిన కొడుక్కు ఫ్యాక్టరీ బాధ్యత లప్పగించి కాలుమీద కాలేసుక్కూచున్న వెంకట్రామయ్య కవన్నీ తెలుసు. పైలా పచ్చీసులో తండ్రి నుండి బాధ్యతలు స్వీకరించిన నాగేందర్కైతే తనమీద తనకు బోలెడంత విశ్వాసముంది దానిక్కారణం ... కనీసం కాలేజీ మొహంగూడా చూడని తండ్రి ఫ్యాక్టరీని స్థాపించి పకడ్బందిగా నడిపిస్తున్నప్పుడు అంతపెద్ద డిగ్రీ పుచ్చుకున్న తాను అంతకంటే పకడ్బందీగా నడపగలననే నమ్మకం. కాని పదవి నలంకరించిన పదిరోజుల్లోనే చెప్పల్లేకుండా పలుగురాళ్లల్లో పరుగెత్తినంత పనవుద్దని కలలో గూడా ఊహించలేదు.

ఉదయం ఆఫీసు కర్చీలో కూచోగానే ఇంటర్లో క్లాస్మేటు ఇందిర మనోఫలకమ్మీద ప్రత్యక్షమైంది. చెక్కిన శిల్పం, చక్కని రూపం. సన్నని పెదాలు, నున్నని చెక్కిళ్లు. . క్లాసులో తన పక్కనే కూచుండేది. ప్రాక్టికల్స్లో తనకెంతో సహాయపడేది. నిన్న సాయంత్రం ఫ్యాక్టరీ ముందు అలా కన్పించి ఇలా మాయమైంది. ఆ సుందరాంగి చిరునవ్వులు గిలిగింతలు పెడుతున్న సమయంలోనే ప్రమాదం జరిగింది.

సీనియర్ వర్కర్ కనకయ్య కాలు మిషన్లో చిక్కుకుపోయింది అరుపులు, పెడబొబ్బలు వినబడగానే ఎలక్ట్రిక్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేశారు మిషన్లాగిపోయినై కనకయ్య కాలు ముక్కలైంది వర్కర్లంతా కలిసి చేతులమీద హాస్పిటల్‌కు చేర్చారు కాలును మోకాలు వరకు తీసెయ్యక తప్పలేదు

మద్యాహ్నం వర్కర్లు కట్టకట్టుకుని చాంబర్లో కొచ్చారు తోటి వర్కర్ రక్తం కళ్లల్లో కదలాడిందేమో ఆవేశంతో ఊగిపోతున్నారు

"ఇంత ఘోరం జరిగినా మీకు చీమకుట్టినట్టైనా లేదా?" నిలదీశాడొకడు. అయినా తనక్కోపం రాలేదు.

"ఎందుకు లేదూ! హాస్పిటల్ ఖర్చులనీ ఫ్యాక్టరీయే భరిస్తుందని డాక్టర్‌కు ఫోన్‌లో చెప్పానుగదా!" సముదాయించ బోయాడు.

"అంటే ... ఒక్కఫోన్‌తో చేతులు దులుపేసుకోవడమేనా? కనకయ్య కాలు సగం నరికేశారు తెల్సా! పాపం! అన్నమోరామచంద్రా అంటూ అల్లాడిపోతున్నాడు." ముందుకొచ్చాడు యూనియన్ లీడర్ నారాయణ.

ఆఫ్టరాల్ ఓ వర్కర్‌కు అంతధైర్యమా! తనకు చిర్రెత్తింది. అజాగ్రత్తగా పంజేస్తే .కాలేమిటి, తల గూడా నరుక్కుపోతుంది."

"ఐతే అదంతా కనకయ్య తప్పేనా?" గుర్రుమన్నాడు మొహం ఎర్రబడి కనుగుడ్లు ముందుకొచ్చినై.

"కాపోతే నాదా? కొంచెం మర్యాదనేర్చుకో!"

"మర్యాద మన్ననలు పాటించక పోవడానికి మేమేమన్నా ఫ్యాక్టరీ ఓనర్స్‌మా? ముందు మీరే.." నారాయణ మాటల్లో కవ్వింపు.

"కొంచె వెనకాముందాలోచించి మాట్లాడు!"

"మా జాగల మీరెంటే తెలుస్తది అవస్త " ఇంకేదేదో అంటున్నాడు

చదువురాని, పూటకులేని వీళ్ళే ఇంత రెచ్చిపోతుంటే తన పరువు ఎఱ్ర చెరువులో కలిసిపోదా! అరికాలు మంట నెత్తికెక్కింది

అసహ్యం అందోళన మించు కొచ్చినై

"యూ షటవ్ అండ్ గెటౌట్!" వింతగా గొంతు చించుకొచ్చింది అశ్చర్యంగా చూశారంతా. నలుగురూ నాలుగు మాటలన్నారు. వెంటనే ధర్నా ప్రారంభమైంది

యూనియన్ జిందాబాద్

యాజమాన్యం డౌన్ డౌన్

"దమన నీతి నశించాలి. కార్మికుడు కనకయ్యకు న్యాయం చెయ్యాలి." నినాదాలతో దిక్కులు పిక్కటిల్లినై.

ఇంకేం న్యాయం చెయ్యాలో అర్థంగాలేదు చేతులు ముడుచుక్కూచోవడం చేతకాని తనం... నారాయణను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించి మెరుపులా బయటి కొచ్చాడు. కారును స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ ఇల్లుచేరాడు.

అప్పటికే సంగతంతా తండ్రికి తెలిసిపోయింది. గడపలో కాలుపెట్టగానే ఎదురొచ్చి వివరాలడిగాడు అంతా చెప్పేశాడు తండ్రి తప్పక మెచ్చుకుంటడనుకున్నాడు. కాని... తండ్రి మొహం మంకెన పూవులాగైపోతుందనుకోలేదు.

ఎందుకైనా మంచిదని "ఏమైంది నాన్నా!" అడిగాడు కళ్లలోకి చూస్తూ నవ్వాలని ప్రయత్నించాడు.

"అయితే అగ్నిలో ఆజ్యం పోసొచ్చావన్నమాట". తలపట్టుకున్నాడు వెంకట్రామయ్య

"కాదు నాన్నా!" తన సబ్జెక్ట్ నాలేజి నంతా తండ్రి ముందుంచాలనుకున్నాడు "అడ్మినిస్ట్రేషన్లో ఏ మాత్రం అలసత్వం కనబడినా వర్కర్సు చేతిలో ఉండరు డిసిప్లిన్ కాపాడకపోతే ఫ్యాక్టరీ దివాలాదీస్తుంది" చెప్పుకు పోతుంటే ఆపు మని చేత్తో సైగచేశాడు తండ్రి అనమ్మతినంతా అదుపులో ఉంచుకోకతప్పలేదు వెంకట్రామయ్యకు

"ఈ సమయంలోనే మన విజ్ఞత నుపయోగించాలి నాగూ!"

"అందుకే నారాయణను ఉన్నపళంగా సస్పెండ్ చేసొచ్చాను నాన్నా!" నవ్వబోయాడు.

వెంకట్రామయ్యకు ఒంటినిండా ముళ్లగుచ్చుకున్నట్లైంది. గొంతులో కాఠిన్యం చోటుచేసుకుంది.

"పుస్తక జ్ఞానాన్నంతా మస్తకములో దాచుకుని వాస్తవ పరిస్థితుల నెదిరించడములో చాకచక్యం ప్రదర్శించాలి నాగూ!"

"అదే .... అదే నాన్నా... అలాగనుకునే ఇలా చేశాను."

"ఒక్కటి గుర్తుంచుకో నాగూ! కార్మికుల చెమట బిందువులే - బిందువులాంటి మన సంపదలను సింధువులా పెంచాయి. వాళ్ల కాయకష్టాన్ని క్యాష్ చేసుకుని మనం కోటికి పడగెత్తాం.." సముదాయించబోయాడు.

నాగేందర్లో కాలనాగు బుసలుకొట్టింది.

"వాళ్లూరికే చెయ్యడం లేదుగదనాన్నా! జీతాలు బోనస్లు, రకరకాల అలవెన్సులు లాగేస్తున్నారు గదా!"

"మనం ఎన్ని ఇచ్చినా ఆత్మీయత అందివ్వని నాడు అంతా బూడిదలో పోసిన పన్నీరేరా...!"

ఇంకే మాట్లాడాలో అర్థంగాలేదు నాగేందర్‌కు

"నువ్వు స్వయంగా రంగంలోకి దిగి కనకయ్యను కంపెనీ కారులో హాస్పిటల్‌కు చేర్చితే బాగుండేది

నాగేందర్‌కా ధోరణి అసలే నచ్చలేదు

"హుం! వానికి సేవలు చేస్తూ అక్కడే పడుంటే ఇంక బాగుండేదా?" గొంతులో వెటకారం సుడులు తిరిగింది

"అవును. వెంటనే ఎక్స్‌గ్రెషియా ప్రకటిస్తే ఎక్సలెంట్‌గా ఉండేది. "

"ప్యాక్టరీలో భాగమిస్తే .."

"నాగూ! నేను చెప్పేది విను." సింహగర్జన

"నాకంతా తెలుసు నాన్నా! మీరీ విషయంలో జోక్యం.."

చెంపచెళ్ళుమంది. నాగేందర్ బుర్ర గిర్రుమంది ఎన్నడూ పల్లెత్తు మాట అనని నాన్న పళ్లూడేలా చెంప దెబ్బ కొట్టడమా! మెదడు పొరల నలుమకున్న ఆవేశం అదృశ్యమైంది. అమాంతం బాధ, వేదనలు పొంగుకొచ్చినై. ఎదురుగా అమ్మ కన్పించింది.

"అమ్మా .. చూడమ్మా.... నాన్న!" చిన్నపిల్లాడిలా తల్లి ఒడిలో వాలిపోయాడు

"బాధగా ఉందా బాబూ!" తల్లి పరమేశ్వరి తలనిమిరింది పుత్రప్రేమను పొత్తి కడుపులో అదిమిపెట్టుకుని, "ఈ చెంపదెబ్బను నీ జీవితములో మరవొద్దు నాన్నా! కార్మికులు కార్ఖానాలకు పునాదిరాళ్ళు. వాళ్లను కాపాడుకోవడం మన బాధ్యత....." బుజ్జగించింది.

అప్పటికే నాగేందర్ కళ్లను నీటిపొరలు కమ్ముకున్నై.

"ఇప్పుడు నేనేం చెయ్యాలమ్మా?"

"వాళ్లు సమ్మెనోటీసు ఇవ్వకముందే జాగ్రత్త పడాలిబాబూ!" భుజాలు పట్టిలేపి పక్కన కూచోబెట్టుకుంది.

"సమ్మె చేస్తే మనం లాకౌట్ ప్రకటించవచ్చు గదమ్మా!"

"పిచ్చికన్నా! సమస్యను తెగేదాకా లాగొద్దు లాకౌట్ అనేది ఫ్యాక్టరీ యాజమాన్యానికి లాకప్‌లాంటిది కార్మిక రంగములో అశాంతి కర్మభూమికి చేటు ప్రతిఫ్యాక్టరీలో ఇలాగే జరిగితే ఉత్పత్తి పడిపోతుంది, దేశాభివృద్ధి కుంటుపడుతుందిరా! మీనాన్న చెప్పినట్టు చెయ్ తల నిమిరి భర్తవైపు తిరిగింది. "మన వాడికి పెళ్లీడొచ్చింది గదండీ!" పెదాల మీద చిరునవ్వు మెరిసింది

టీ వీ లో హాస్య కార్యక్రమ మేదో ప్రసారమౌతోంది దాని మానాన దాన్నొదిలేసి

"పెళ్ళి సంగతి సరేగాని ముందు మీరు నావెంట నడవండి" అదేశించాడు వెంకట్రామయ్య.

సరిగ్గా అదే సమయములో... అస్పత్రి - కార్మికులతో కిటకిటలాడ్తోంది. కనకయ్య మంచం వద్ద నలుగురైదుగురు కార్మిక నాయకులున్నారు. కనకయ్య కప్పుడే స్పృహవచ్చింది. తన కాలు సగంతీసేశారని తెలిసి బావురుమన్నాడు

"ఏ జన్మల ఏపాపం జేసిన్నో గీజన్మల గీశిక్ష పడింది." అంటూ కన్నకూతురు చెతులందుకుని కుమిలి పోతున్నాడు.

కార్మిక నాయకుల గుండెలు గుస గుస లాడినై. యాజమాన్యం మీద కస్సుబుస్సులాడ్తున్న నారాయణ.

"శిక్ష నీ ఒక్కనిది కాదన్నా! మనందరిది. నువ్వు ధైర్యంగా ఉండు." మిగతా నాయకులవైపు చూచాడు-ఇప్పుడు మన కర్తవ్యమేమిటన్నట్టు.

"సమ్మె చేసైనా సరే న్యాయం జరిగేలా చూస్తాం". మరో నాయకుడన్నాడు. కాలువదపలేని కనకయ్య గుండె గోడలకు గుండుసూదులు గుచ్చుకున్నట్టుంది.

"మీరు కొంచెం ఆలోచించుండ్రి తొందర పడకుండ్రి" బతిమాలాడు

ఆస్పత్రి సిబ్బంది అపినా ఆగుకుండా మరికొందరు కార్మికులు మంచం చుట్టూ మూగారు. కనకయ్య దీనస్థితి కంటతడి పెట్టించింది

"ఇంకా అలోచించేదేముందటా! కార్మికుల మంతా కలిసికట్టుగా ఉంటే కాలనాగులాంటి యాజమాన్యం గూడా కాళ్లూ చేతులు ముడుచుకోవల్సిందే" ఊగిపోయా డో కార్మికుడు

"ఔను వెంటనే సమ్మెనోటీసిద్దాం" కోరస్‌గా అన్నారు

"హర్తాలొద్దు" అంటున్న కనకయ్య నెవ్వరూ పట్టించుకోలేదు

"పదండి డైరెక్ట్‌గా వెంకట్రామయ్య గారి వద్దకెళ్లి నోటీసు స్వయంగా అందిద్దాం..." నారాయణ పిలుపిచ్చాడు

అప్పుడే లోపలి కొస్తున్న వెంకట్రామయ్య

"ఔను అన్యాయన్ని ప్రతిఘటించాల్సిందే!" అంటూ నారాయణ భుజమ్మీద చేయ్యేసి నీ సస్పెన్షన్ ఉత్తర్వులు బుట్టదాఖలైపోయినై బ్రదర్ !" ప్రకటించాడు.

కొడుకూ, భార్యను తీసుకుని కనకయ్య దగ్గరికెళ్లాడు. "ఎలాగుంది కనకయ్యా!" అంటూ పక్కన కూచున్నాడు.

"నన్ను మన్నించు కనకయ్యా!" నాగేందర్ చేతులు జోడించాడు. కారులో వచ్చేప్పుడు తండ్రి చెప్పిందంతా కలవర పెడుతోంది

"అయ్యా... మీరొచ్చింద్రా...." కనకయ్య లేవబోయాడు.

"వద్దు నాన్నా!. లేవొద్దు." పక్కనున్న కూతురు ఆపేసింది.

అరె... ఇందిర కనకయ్య కూతురా! నాగేందర్ చూపులు ఇందిర మీద నిలబడిపోయినై.

వెంకట్రామయ్యలో వేదన పెరిగింది. ప్రమాదం జరగ్గానే మావాడు సరిగా స్పందించలేదు. కుర్రాడు గదా! ఏమీ అనుకోవద్దు..." అంటూ అపిల్ ముక్క నోటికందించాడు.

ఆపదలో యజమాని ఆత్మీయత కనకయ్య ఎదను పొంగించింది

"నాకిదొక్కతే కూతురు బాబూ! దీన్ని లోకంలపడేసి వాళ్లమ్మ మరో లోకంలకు వోయిందయ్యా! దీన్ని బాగానే సదివించిన.. కాని పెండ్లి ఎట్లా చెయ్యాలే. ..!" కళ్లల్లో నీళ్లు తిరిగినై.

కొండమీది కోతికి కొబ్బెరిచిప్ప కనబడినట్టనిపించింది నాగేందర్‌కు వంగి తండ్రి చెవిలో ఏదోచెప్పేశాడు

"ఫాక్టరీ కుటుంబములో మనమంతా సభ్యులం కనకయ్యా! అని వెంకట్రామయ్య భార్య వైపు తిరిగాడు. "ఈ అమ్మాయి మనింటి కోడలైతే ఎట్లా ఉంటుంది?" అడిగాడు.

"మహాలక్ష్మి లక్ష్మణంగా మనింటికొచ్చినట్టు ఉంటుంది." అందావిడ మురిసిపోతూ." నువ్వేమంటావమ్మా!" అంటూ ఇందిరను దగ్గరకు లాక్కుని చెంపలు నిమిరింది.

ఇందిర చెంపలు సిగ్గుతో కెంపులైపోయినై ముఖమో వెలుతురు పూవై సహస్రదళాలుగా విచ్చుకుంది. నాగేందర్ కళ్లల్లో కళ్లు కలిపింది.

"అమ్మదొంగా!" నాగేందర్ ముందుకు రాబోయి ఇందిర కళ్ళసైగల నందుకుని ఆగిపోయాడు

"నిజమా...ఇదంతా నిజమా బాబు గారూ!" నకకయ్యాకు నమ్మశక్యం కాలేదు.

"నిజమే అన్నగారూ! మీరు ఊ ంటే వెంటనే ముహూర్తాలు పెట్టిద్దాం!" అంది పరమేశ్వరి.

"అన్నట్టూ... కట్నకాన్కల ప్రసక్తేమీలేదు. ఇదిగో ఎక్స్‌గ్రాషియా చెక్కు." నాగేందర్ కనకయ్య చేతికి చెక్కు అందించాడు.

"నా కూతురికి బంగారమసొంటి సంబంధం దొరికింది. ఇంక నాకు గిదెందుకూ?" అంటున్న కనకయ్య నరనరాన ఆనందోత్సాహం ప్రవహిస్తూంది.

"దానికదే - దీనికిదే" అంటూ నారాయణ నవ్వేశాడు
అతని చేతుల మీదుగా చెక్కు కనకయ్య తలగడ కిందికెళ్లిపోయింది
కార్మికుల్లో ఆనందోత్సాహాలు ఉరకలేశాయి
"ఆనందమానంద మాయేనే, మా ఇందిరమ్మ పెళ్లి కూతురాయేనే" పాడుతూ చిందులు తొక్కారు

(ఆకాశవాణి - హైద్రాబాదు ప్రసారం 19-10-1998)